# అత్తగారూ_నరసమ్మాయణం




"ఓ వంటాయినోయ్!... ఎదవసచ్చి నోడు!... యినపడి పలకడు-యీణ్ణి పొయిలో బెట్ట! ... ఓ వంటాయ నోయ్!..."

"అబ్బబ్బ!... ఆ పనిమనిషిని కాస్త అరవ్వద్దని చెప్పు .... ఒకే కేక లేస్తోంది.... అంటూ మావారూ..."

"అబ్బబ్బ!... ఏమిటమ్మా ఆ పని మనిషి – రాక్షసిలా అరుస్తోంది!... దాని కేకల్తో నా చదువు సాగడం లేదు..." అంటూ మా వాడూ, కొత్తగా మా యింటి కొచ్చిన గుంటూరు పనిమనిషి మీద చీకాకు పడటం మొదలెట్టారు...

దొరక్క దొరక్క యింతకాలానికి ఒక పనిమనిషి మన వేపునుంచి వచ్చిందీ, అచ్చ తెలుగుదీ, కష్టపడి పనిచేసే ఒక మగాడదీ దొరికిందని మా అత్తగారూ నేనూ ఎంతో మురిసిపోయాం ... వచ్చిన కొత్తల్లో ఎంతో వినయంగా మాట్లాడేది .... ఎంతో సంతోషించాం... జీవితాంతం మీ పాదాలకాడ పడుంటాను, నాకు ఎవరూ లేరన్నది...ఆనందించాం... తన మొగుడు తనను వదిలేసి వేరే ఎవత్తెనో పెళ్ళాడాడన్నది ... "అయ్యోపాపం!" అనుకున్నాం... అన్ని పన్లూ చేస్తానంది...

"ఒడ్డూ పొడవూ గల ఆడది, యింటిపన్లన్నీ బాగా చేస్తుంది ... యింటిపట్టునే పడుంటుంది ... సాయంకాలం ఆరుగంటలు కాగానే టైమ్ ప్రకారం వెళ్ళిపోదు... కాస్త నా వీపుకు అమృతాంజనం అన్నా పట్టిస్తుంది...ఏ వేళప్పుడైనా యింట్లో పనిమనిషి వుంటే ఆదాగి వేరు..." అంటూ మా అత్తగారు ఆనందపడి పోయారు...

వచ్చిన మర్నాడు తెల్లవారేసరి కల్లా యింటిపనంతా చేసేసింది...మా అత్తగారి మడిపాత్ర లన్నీ తళతళ మనేట్లు తోమి తులసికోటదగ్గిర బోర్లించి పెట్టింది ... ఆమె వంట చేసుకునే మడి బొగ్గులకుంపటి తుప్పు వదిలించి కొత్తకుంపటిలాగా తోమి పెట్టింది... యింటిముందూ తులసి కోట చుట్టూ, రకరకాల ముగ్గులు వేసింది...మజ్జిగ చిలికి వెన్న తీసి పెట్టింది...యిల్లంతా చిమ్మి, తుడిచీ, అద్దంలా చేసి పెట్టింది ... శుక్రవారం అని గడపలకు పసుపు కుంకుమలు పెట్టింది...వేణ్ణీళ్ళు కాచి మా అత్త గారికి స్నానానికి రెడీ చేసింది...

మా అత్తగారు నిద్ర లేస్తూనే పని మనిషి చేసిందంతా చూసి, "ఆహా! ఆహా!...ఎంతకాలానికి, ఎంతకాలా నికి .... మన వైపు పనిమనిషి దొరికి,

పద్మశ్రీ భానుమతీ రామకృష్ణ



యిల్లూ పాత్రలూ యింత శుభ్రంగా కళకళలాడుతూ చూడగలిగాను!..." అంటూ బ్రహ్మానంద పడిపోయి "ఒసే నరుసూ!"...అంటూ ఆ పనిమనిషిని పిల్చారు ... దాని పూర్తి పేరు నరసింహమ్మ ...

"ఏంది పెద్దమ్మగారూ!"...అంటూ అతివినయంగా మా అత్తగారి ముందు నిలబడ్డది ...

ముఖంనిండా పసుపుపూసుకు, కండ్ల నిండా కాటుక పెట్టుకుని, తలనున్నగా దువ్వి పూలు పెట్టుకుని రూపాయంత బొట్టు పెట్టుకుని గ్రామదేవతలా కనిపిస్తున్న నరసమ్మను చూసి మా అత్తగారు తృప్తిగా చిరునవ్వు నవ్వి! ... "చద్దన్నం తిన్నావా !" అని అడిగారు ఆప్యాయంగా...

"ఆ తిన్నానం డమ్మగారు" ... అన్నది కాస్త సిగ్గుపడుతూ నరసమ్మ..

"అట్లాగే పెందలాడే చద్దన్నం తినేసేస్తూవుండు ... అప్పుడే నీవు యింతచాకిరీ చెయ్యగలుగుతావు"... అంటూ స్నానానికి వెళ్ళిపోయారు.

మా అత్తగారు భోంచేస్తూనే — ఆమె కాళ్లు పట్టడం, కాసేపు ఆమె నడుముకూ, వీపుకూ అమృతాంజనం పట్టించి మర్దన చేయడం, యింకా ఆమె కిష్టమైన పన్లన్నీ కొన్ని చేస్తూండడంవల్ల మా అత్తగారి అభిమానాన్నీ, ఆదరాన్నీ నర్సమ్మ యిట్టే సంపాదించుకుంది.

నరసమ్మ వచ్చి మూడురోజులే అయింది...నాలుగవరోజునుండీ నిద్ర కాస్త లేటుగా లేవడం మొదలెట్టింది.

పాత్రల తళతళా, యింటి నిగనిగా, కాస్త తగ్గాయి...వంటవాడు పిలిస్తే 'ఏహ వుండు! ఎదవగోల... వూరక అది నూరూ, యిది రుబ్బూ అంటూ పేణాలు తీత్తుండావ్...' అంటూ విసుక్కోడం నా చెవినిపడ్డది- మా అత్తగారి చెవిని పడ్డదోలేదోమరి.

వారం రోజు లయింది ... పాత్ర సామాన్లు యింకా తోమలేదనీ, కాఫీ ఫిల్టరు యింకా కడగలేదనీ, పెద్దమ్మగారి స్నానానికి యింకా బాయిలర్ అంటించలేదనీ, మజ్జిగ చిలకలేదనీ, యిళ్ళంతా యింకా చిమ్మలేదనీ వంటవాడి 'కంప్లెయింట్స్' ఆరంభం అయ్యాయి...అవన్నీ విన్న మా అత్తగారిముఖంలో కొద్దిగా ఆందోళన కనిపించింది.

ప్రొద్దుటే స్నానం చేసి పట్టెడు కుంకుమతో కళకళలాడుతూ పనిచేసే నరసమ్మ కాస్తా వారంరోజులు అయ్యేసరికి లేటుగా నిద్ర లేవడం, విసుక్కుంటూ మూలుక్కుంటూ చెయ్యి బెణికింది, కాలు బెణికింది అంటూ పాత్రలన్నీ ఎత్తి పడెయ్యడం మొదలెట్టింది...

పెద్దమ్మగారు కాళ్ళు పట్టడానికి పిలిస్తే "వుండడమ్మా వస్తన్నానూ! ...అసలే పన్లు తెమలక సస్తుండా... ఎదవ సచ్చినోడు — యీ వంటోడు పాత్తర్లన్నీ ఒక్కసారేసితగలబడితే గద! చేతి కెదోరోగం ఒచ్చింది. వూరికే కుక్క నమిల్నట్టు నముల్తావుంది ముంజెయ్యి"...అంటూ కుడిచెయ్యి పిడికిలిబట్టి నేలకేసి బాదుకుంటూ పెద్దమ్మగార్ని విసుక్కోడం దాకా వచ్చింది...

మా అత్తగారు దాని ధోరణి మారిందని గ్రహించి నిట్టూర్చారు. రానురానూ మాట్లాడితే అందరిమీదా కస్సుమంటం మొదలెట్టింది నరసమ్మ. అంతవరకూ బాగా పనిచేస్తూవచ్చిన నరసమ్మకు అంత విసుగూ, చిరాకూ ఎందుకు కలిగాయో నా కర్థంగాలేదు.

మనిషి మళ్ళీ మంచిదే!... కష్టపడి పని చేసేదే... ఒళ్ళు దాచుకునే స్వభావం అసలు లేనేలేదని మొదట్నే తెలిసింది ... మరి ఎందు కల్లా విసుక్కుంటోందో నాకు బోధపళ్ళేదు...

మధ్యాన్నం మా అత్తగారు భోంచేసి హాల్లో నడుం వాలుస్తూ నరసమ్మను పిలిచి "అరికాళ్ళు మంటలుగా వున్నయ్, కాస్త ఆముదం పట్టించవే" అన్నారు...

"అబ్బ! నా శాతగాదు పెద్దమ్మ గారూ... యిప్పుడు నే నేం జెయ్ లేను... నా ఒంట్లో కాస్తగూడ బాగులేదు...యిక నే నాగా బెడితే యీ యింటెడు శాకిరీ ఎవరు జేత్తారనీ, పేణం బిగబట్టుకుని చేత్తా వుండా...కాసేపట్ట గొడ్లకొట్టంకాడికెళ్ళి నడుం వాలుత్తానమ్మా" ... అంటూ పెరటివేపు వెళ్ళింది... మా అత్తగారు గతుక్కుమన్నారు ... "యిదైనా కొంతకాలం వుంటుందని ఆశపడ్డాను...వాలకం చూస్తే బాగా లేదు... ఊ"...అంటూ నిట్టూర్చారు బరువుగా...

నరసమ్మ తత్వం అర్థం చేసుకున్న నేను నరసమ్మ పని వదిలి వెళ్ళదని తెలుసుకున్నాను... కాని దానికేవో కొన్ని యిబ్బందులున్నాయనీ, అందువల్లే విసుక్కుంటూందనీ గ్రహించాను...

మా అత్తగారు మంచి నిద్రలో వున్నారు...వంటవాడు పరిగెత్తుకుంటూ వచ్చి "అమ్మగారు అమ్మగారూ! పెరటివేపు మీ కొక తమాషా చూపిస్తాను త్వరగా రండి" ... అన్నాడు. వాడి వెనకాలే పెరటివేపు



కెళ్ళాను...వాడు అడుగులో అడుగు వేసుకుంటూ చప్పుడు కాకుండా గొడ్లకొట్టం దగ్గిరికి తీసుకెళ్ళాడు... ఓ మూల వున్న చిన్న కిటికీలోనుంచి లోపలికి తొంగిచూశాను...

జాలీగా లిల్లాయిపదం పాడుతూ, దర్జాగా కూర్చుని, బారెడు చుట్ట నోట్లో పెట్టుకుని కాలుస్తూ యీ లోకాన్నే మర్చిపోయిన నరసమ్మ కనిపించింది... వంటవాడు మూతికి తుండుగుడ్డ అడ్డం వుంచుకుని నవ్వుకుంటూ వంటింట్లోకి వెళ్ళిపోయాడు..

ఆనందంలో ఒళ్ళు మరచి చుట్ట పొగను ఆస్వాదిస్తున్న నరసమ్మ ఆ సమయంలో నా కంటికి ఉమర్ ఖయ్యాంలా కనిపించింది ... పక్కనే సాఖీలా వున్న ఆవుదూడ నరసమ్మను అనుకుని కూర్చుంది ...

నిశ్శబ్దంగా వచ్చేశాను ... నేను చూసిన దృశ్యం మా అత్తగారే చూస్తే!...

లోపలి కొస్తూనే వంటవాడు చెప్పాడు...నరసమ్మ కా విసుగంతా చుట్ట కాల్చడానికి తీరిక లేకనే అనీ, చివరకు తోటవాడిని బ్రతిమాలి నాలుగణాలు అడిగి తీసుకుని వెళ్ళి చుట్టపొగాకు తెచ్చుకొందనీ, అగ్గిపెట్టె వంటింట్లోంచి పట్టికెళ్తుంటే వెనకాలే వెళ్ళి చూశాననీ, చెప్పాడు...

యీ సంగతి పెద్దమ్మగారికి తెలీకూడదని వంటవాడికి గట్టిగా చెప్పాను...

కాసేపటికి నరసమ్మ అతి హుషారుగా నవ్వుకుంటూ హాల్లో కొచ్చి చేతులో వున్న ఆముదం సీసా ఓ పక్కన పెట్టి, మా అత్తగారి కాళ్ళ దగ్గిర కూర్చుంది ... గాఢ నిద్రలో వున్న మా అత్తగారి రెండుకాళ్ళూ బర్రున తన ముందుకు లాక్కుంది... "ఓ యమ్మ ఎవరేవ్...అంటూ మా అత్తగారు వులిక్కిపడి లేచారు ... నరసమ్మ పకపక నవ్వేసి "నేనమ్మా!



కాళ్ళిట్టియ్యండి ... ఆమదం రుద్దుతా" ... అన్నది ... "యిప్పుడొద్దే" అని మా అత్తగారు అంటున్నా వినకుండా "మీకు తెలవదమ్మగారూ; మీ రూరుకోండి - కాళ్ళిట్టియ్యండీ... అంటూ బలవంతంగా ఆమె రెండు కాళ్ళూ లాక్కుని ఆముదం రుద్దడం మొదలెట్టింది ... యింకా గట్టిగా ఒద్దంటే తంతుందేమో అని మా అత్తగారు భయపడ్డట్టు గ్రహించాను... నరసమ్మలో కలిగిన ఆ మార్పు ఏమిటో అర్థంగాక మా అత్తగారు అయోమయంగా నావైపు చూశారు. ఆముదం రుద్దినంతసేపూ నరసమ్మ ఏవో కబుర్లు చెప్పి వంటవాడిని వెక్కిరిస్తూ నవ్వుతూనేవుంది ... అది నవ్వేకొద్దీ మా అత్తగారి ముఖం ఓ పెద్ద క్వశ్చన్ మార్కులా తయారయింది...

"నాకు బోలెడు అంట్లున్నయ్యమ్మోవ్ ... ఆ ఎదవ సచ్చినోడు బండెడేత్తాడు బొచ్చెలు ... అంట్లు తోమి, యిల్లు జిమ్మి, సాయంత్రంగా మీ యీపుకి అమరతాంజనం రుద్దీ, ఏణ్ణీళ్ళు కాపటం ఏస్తా... మీరు మడిగట్టుకున్నా సరే తాకుతా" ... అంటూ పకపక నవ్వుకుంటూ అంట్లు తోమడానికి వెళ్ళింది నరసమ్మ ... మా అత్తగారు హుషారుగా వెళ్తున్న నరసమ్మ వైపే చూస్తూ, "ఏమిటే యిదీ ... ఒట్టి ఖయ్యాళీ మనిషిలా వుందే!" ... అన్నారు ... నవ్వి వూరుకున్నా ...

సాయంకాలం మా అత్తగారు చూడకుండా నరసమ్మను రహస్యంగా పిలిచి దాని చేతులో అయిదు రూపాయలు పెట్టాను ...తెల్లబోయి నా కెందు కీ రూపాయ అన్నట్లు నా వైపు చూసింది..."నీ సొంతఖర్చుకు వుంచుకో ... నీ దగ్గిర డబ్బుకూడా ఏమీ లేదుగా! ... వాళ్ళనీ వీళ్ళనీ చిల్లర డబ్బు లడక్క ... అందుకే యిస్తున్నా"...అన్నాను...

నరసమ్మ కేదో అనుమానం కలిగి "నా కేం ఖర్చుందమ్మగారూ...అంది



నేల చూపులు చూస్తూ..."నాకంతా తెలుసులే నరసమ్మా"! ... అన్నాను నవ్వుతూ ... యిక బాబైపు చూట్టానికి ముఖం చెల్లని నరసమ్మ చటుక్కున నా రెండు పాదాలూ పట్టుకుని "అమ్మగారు. అమ్మగారు నన్ను చమించండి ... ఎదవలవాటు ... పొగాక్కంపనీలో పనిచేసేదాన్ని... ఆడ ఆడోళ్ళంతా కాలుస్తావుంటే అలవాటయింది...కోపగించుకోని పంపించెయ్యకండమ్మగారూ...దిక్కులేందాన్ని ... మీ నీడనే పడుండామనుకున్నా ... అలవాటయిన మూలా పిచ్చెత్తిస్తుంటది...వంటోడికీ, పెద్దమ్మ గారికీ భయపడి యీ వారంరోజులూ పళ్ళు గరుసుకుని పనిజేశా ... యీ విషయంలో మీరు కోప్పడకపోతే యిక ఎంతపనన్నా జేత్తా...లేకపోతే ఏంటో నోరుతుత్తర బుట్టి పిచ్చెత్తిస్తుంటదమ్మా — కాసేపు సుట్ట గాలిత్తే యిక అగమేగాలమీద పని జేస్తా"—అని నరసమ్మ చెపుతుంటే నాకు నవ్వొచ్చింది.

"ఆలాగే కానీ... పెద్దమ్మగారికి మటుకు తెలీకుండా చూడు"... అన్నాను.

"అమ్మో! అమ్మో! ఎంతమాట ఎంతమాట!— అట్టంతా తెలిసిన్దానా అమ్మా! అయమ్మ ఎంత మడో. నాకు తెలవదూ!"— అంటూ చెంపలేసుకుంది...వెనకనించి నరసమ్మ యాక్షను చూస్తున్న వంట వాడు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ తలుపుచాటున దాక్కున్నాడు ...

ఆరోజునుంచీ నరసమ్మ మళ్ళీ మామూలుగా ఎగిరెగిరి పని చేయడం చూసి మా అత్తగారి ముఖంలో కళ కనిపించింది...కాని దాని అరుపులూ, కేకలూ ఎక్కువయినయ్ అనేదే అందరి కంప్లయింటూ ...

ఎప్పుడైనా దానికి చుట్ట కాల్చే వ్యవధి దొరకనప్పుడే ఆ కేకలూ అరుపులూ వినిపిస్తుంటాయని నాకూ వంటవాడికీ మాత్రమే తెలుసు ... ఆ తర్వాత పకపక నవ్వుతూ పని చేస్తుంటుంది...

ఆ విషయం యింకా మా అత్తగారికి తెలియని రహస్యంగానే వుండిపోయింది... ✲

